# కోయపిల్ల

సింహపురి పట్టణం మధ్యలో ట్రంకురోడ్డునానుకొని అయిదెకరాల స్థలంలో నిర్మించబడిన కాంప్లెక్సు సినిమా థియేటరది. పైన మూడు సినిమా హాళ్లు, క్రింద రెండు సినిమా హాళ్ళు ఒకే భవనంలో వుంటాయి.

ఆ థియేటర్లలోని ఒక సినిమా థియేటరు ఫస్టుక్లాసు సినిమా క్యూలో నిలబడి వున్నాడు ప్రసాదరావు. అతను టక్‌చేసి నీట్‌గా, అందంగా వున్నాడు. వయసు నలభై ఏళ్లుంటాయి. క్యూలో నిలబడ్డవాడు అలాగే నిలబడక, మిగతా క్యూలలో వున్న జనాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు.

"దొరా, నాకూ ఓ టిక్కెటు తీసియ్యి, ఆడాళ్ల 'కూ' సానా పెద్దదిగా వుందాది" అన్న ఆడగొంతు విని ప్రక్కకి తిరిగిచూశాడు ప్రసాదరావు.

ప్రక్కనే ఓ ఇరవై ఏళ్ల వయసున్న ఒక కోయస్త్రీ నిలబడి వుంది. చేతులకు కడియాలు, కాళ్లకు కంటెలు, ముక్కుకు బులాకి, చెవులకు పెద్దపెద్ద రింగులు వున్నాయి. తలవెంట్రుకలు ముడివేసి కొప్పుచుట్టుకొని వుంది. మాసిన గుడ్డలతో మనిషి మురిగ్గావున్నా, ముఖం మాత్రం కళగా వుంది. అందగత్తే అనుకొన్నాడు.

"మాది గూడెందొరా. పొద్దనొచ్చినా దువ్వెన్లు, రిబ్బన్లు, పక్కపిన్నులు అమ్ముకొని పొద్దుబోయి బస్టాండుకెలితే గూడెంకెల్లే ఆకరి బస్సు ఎల్లిందని సెప్పిన్రు. సినిమా జూసి పొద్దనెల్దామని" బ్రతిమాలుతున్న ధోరణిలో అంది.

కాదనలేక ఆమె అందించిన పదిరూపాయల నోటు తీసుకొన్నాడు ప్రసాదరావు. అతనికి ముందు నలుగురే వున్నారు. క్యూలో తనకు తప్పకుండా టిక్కెట్లు దొరకుతాయి.

ఆ సినిమా పేరు 'కోయపిల్ల'. సినిమా వచ్చి రెండు వందల రోజులయినా ఇంకా హౌస్‌ఫుల్‌తో నడుస్తూవుంది. జనం చూసిన వాళ్లే పదేపదే చూస్తున్నారు. ఈ కోయపిల్ల ఒంటరిగా ఇంత రాత్రి సెకండ్‌షోకి వచ్చిందంటే ఇది ఆమెను ఎంతలా ఆకర్షించిందో, ఇది ఎన్నోసారి ఈమె చూడడమో అనుకొన్నాడు.

అతను ఆలోచనల్లో వుండగానే కౌంటరు వచ్చేసింది. రెండు టిక్కెట్లు తీసుకొన్నాడు. అక్కడే ఎదురుచూస్తున్న ఆమెకు టిక్కెట్టు, చిల్లర అందించాడు.

"దండాలు ఎట్టుకొన్నాదొరా. తమరు ఎంతో సాయంజేసింద్రు" అంటూ చేయెత్తి నమస్కారం పెట్టి జనంలో కలిసిపోయింది.

ప్రసాదరావు కాఫీ త్రాగి, సిగరెట్ ముట్టించి కొద్దిసేపు హాలుబయట తిరిగి హాల్లోకి వెళ్లేసరికి అడ్వర్టయిజుమెంట్లు వేస్తున్నారు. ఆ చీకట్లో టికెట్ నంబరు గుర్తుపెట్టుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు.

ఇటు చూసిన అతనికి ప్రక్క సీట్లో కూర్చొని వున్న కోయపిల్ల కనిపించింది. బుట్ట కాళ్ల దగ్గర పెట్టుకొని వుంది. ఆ అమ్మాయిది గోడ అంచున వున్న సీటు. ప్రక్క సీటు తనది.

'ఈ అమ్మాయికెందుకు టికెట్ తీసిచ్చార్రా దేవుడా. నా ప్రక్కనే సీటు పడిందే. రెండున్నర గంటలసేపు ఈమె చెమట కంపు ఎలా భరించేది భగవాన్' అనుకొంటూ తన సీట్లో కూర్చున్నాడు. ఆమె వైపుకు కాకుండా ఇవతలి వైపుకు ఒరిగి కూర్చున్నాడు.

ప్రసాదరావు కూర్చోవడం చూసిన కోయపిల్ల "దొరా! తమరు టిక్కెట్టు తీసిచ్చిర్రు, మరి తెలియంది కాస్త సెప్తారుగా" అంది ఇటు వంగి చిన్నగా.

ఆ వంగడం మామూలుగా వంగడం కాదు. పూర్తిగా అతని మీద పడ్డట్లే వుంది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలు అతని బుగ్గలకు వేడిగా తగులుతున్నాయి. అంత దగ్గరగా వుంది. జేబులోంచి అద్దాలు తీసుకొందామని షర్టు జేబులో చేయి పెట్టబోతున్న అతనికి ఆమె ఉన్నతమైన ఎద బలంగా, తగిలింది.

ఆ పిల్ల సినిమాలో పూర్తిగా లీనమైపోయింది. ప్రతి డైలాగుకి 'భలే... భలే' అని చప్పట్లు చరుస్తూవుంది. పాటలు వచ్చినప్పుడల్లా ప్రసాదరావు తొడల మీద దరువేస్తూ వుంది. మరీ ఆనందం పట్టలేనప్పుడు 'సూడు దొరా.. సూడు దొరా..' అంటూ అతని తొడల్ని గిచ్చుతూవుంది. మధ్యమధ్యలో 'అదేంది సామే... ఇదేంది సామే" అంటూ అతని ముఖంలో ముఖంపెట్టి అడుగుతూవుంది.

అతనికి ఆమె ప్రవర్తన అసహ్యంగా, ఎబ్బెట్టుగా వుంది. అయినా ఆమె తన పద్ధతిని మార్చుకోలేదు.

అరగంట గడిచేసరికి అతని ఆలోచనలు మారాయి. ప్రసాదరావుకు ఆ కోయపిల్ల ఇప్పుడు మురికి కంపు కొట్టే మొరటుపిల్లలా లేదు. వయసు వంపులతో బిగువు కలిగి యుద్ధానికి సిద్ధమైన పోట్లగిత్తలావుంది. అతను సినిమా చూసేది వదిలేసి టైమంతా ఆ మసక వెలుతురులో ఆమెను చూడ్డానికే వినియోగిస్తున్నాడు.

అందమైన ముద్దులొలికే ఆ ముక్కు ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపిస్తూ వుంది. చంద్రబింబంలాంటి ఆ లేత ముఖం అంత చీకట్లో కూడా ప్రకాశిస్తూవుంది. పైట సరేసరి. దాని సంగతి ఆమె పట్టించుకోనేలేదు. పాపికొండల మధ్య ఎక్కడో అడుగున ప్రవహించే చిన్న సెలయేరులా సన్నగా ఉండ చుట్టుకొని గుండెల మధ్య ఎక్కడో అదృశ్యమై భుజంమీద తేలివుంది.

రెండున్నర గంటలు ఎలా భరించాలి భగవంతుడా అనుకొన్న అతను, ఇప్పుడు 'రెండున్నర గంటల తరువాత ఈ ఆనందం పోయి ఎలా బ్రతికేది దేవుడా' అనుకొంటున్నాడు.

"సూడు.. సూడు.. దొరాసూడు" అంది తొడమీద చరుస్తూ.

తెరమీదికి దృష్టి మరల్చాడు ప్రసాదరావు. సినిమా హీరోయిన్ కోయపిల్ల ఆ జలపాతంలో స్నానం చేస్తూవుంది. ఆమె నడుంమీద ఓ జానెడు గుడ్డ, గుండెలమీద ఓ బెత్తెడు గుడ్డ మాత్రమే వుంది. పలుచని బట్టలతో, తడిసిన శరీరంతో ఆమె స్నానం చేస్తుంటే తెల్లని ఆమె ఎదవైపు, నగ్నంగా వున్న ఆమె బలమైన కాళ్ళవైపు చూస్తున్న జనం ఈలలు చప్పట్లతో మారుమ్రోగిపోయింది థియేటర్.

"దొరా! ఈసినిమాలో కాస్త తప్పుందాది దొరా" అంది కోయపిల్ల.

'తప్పా. దీని ముఖం. దీనికేం తెలుసు' అనుకొన్నాడు ప్రసాదరావు.

"నానూ కోయపిల్లనే కదా దొరా, నాకు తెలుసు. మేము సానం ఇట్టా జెయ్యం"

"ఇంకెట్లా చేస్తారు. చెంబుతో పోసుకుంటారా అడవికెళ్ళి ఒంటరిగా" కాస్త కోపంగానే అన్నాడు, అంత శృంగార దృశ్యంలో తనను డిస్టర్బు చేసినందుకు.

"దొరా. కోప్పడమాక. మేం గూడెంలో వుండేప్పుడు నడుంమీద జానెడు గుడ్డ. గుండెల మీద బెత్తెడు గుడ్డే వుంటది. మేము గూడానికి దూరంగా ఏట్లో సానానికి ఎల్లినప్పుడు ఒంటి మీద గుడ్డలుంచుకోం. ఏటొడ్డుకు ఎల్లి అయి రెండూ ఊడబెరికి ఏట్లో దూకి మరీ ఈతలు కొడతాం"

"నువ్వు కూడా అంతేనా" గుటకలు మింగుతూ అన్నాడు ప్రసాదరావు.

"మరి నేనూ అంతే. కట్టెపుల్లలకి, కాయగసుర్లకి ఉదయాన్నే అంత గంజి తాగి అడవికెల్తాం గందా. అదే మా సానం" అదేదో సాధారణమయిన విషయం అన్నట్లు చెప్పింది.

"మీరలా స్నానాలు చేస్తుంటే ఎవరన్నా మగవాడు చూస్తే"

"మగాడు ఎందుకు సూత్తాడు సామే. ఏటి దగ్గర ఘనుండి వచ్చే మగాడెప్పుడూ ఏటి ఒడ్డున జాగర్తగా సూసుకొనే వత్తాడు. ఏటి ఒడ్డున గుడ్డపేలిక కనబడితే ఆమడ దూరానికి ఎల్లిపోతాడు. అందుకే మేం దిగంబరంగా సానాలు సేసి దిగంబరంగానే ఏటి ఒడ్డున పచ్చిగడ్డిలో పడుకొంటాం ఒళ్లు ఆరిందాకా.. ఆయ్"

ప్రసాదరావు రోమాలు నిక్కబొడుచుకొన్నాయి. ఒళ్లంతా వేడి వేడి సెగలతో ఆవిర్లెత్తిపోయింది.

"నీ పేరేంది."

"నా పేరు ఎన్నెలమ్మ. మా అయ్యా అమ్మా 'ఎన్నెలా' అని పిలుస్తారు."

"సరేగాని వెన్నెలా. నీకు పెళ్లయిందా"

"ఏడయ్యింది. అయ్యుంటే ఇయ్యరికి నలుగురు బిడ్డల్ని కనుందునుగదా సామే"

"ఏం మీ అయ్య, అమ్మ పెళ్లి చేయనన్నారా"

"ఆళ్లు సేస్తనన్నరు. నానే వద్దన్నా"

"ఏం?"

"నాను గూడెపోడ్ని ఒల్లుకోలా. సూటుబూటు ఏసిన నీలాంటి పోగ్గాడ్ని సేసుకుందామని"

"అదెలా వీలవుతుంది?"

"ఎందుకు ఈలుగాదు. కట్నం డబ్బులు బాగిస్తే. గొర్రెనయినా, బర్రెనయినా సేసుకొంటారు మీ పట్నంబుల్లోళ్లు. అందుకే ఈ సంపాదనంతా"

షాక్ కొట్టినట్లయింది ప్రసాదరావుకి. అయితే పట్నవాసపు మోజు ఈ పిల్లకు బాగా పట్టిందన్నమాట. తన పని చాలా సులభమయిపోతుంది, అనుకొన్నాడు.

ప్రసాదరావు ఏదో మాట్లాడబోయేంతలో "సూడుదొరా. ఆగూడెం పిల్లకు సీరకడితే ఎంత బాగుందో, నానుకూడా సానంజేసి సీరగట్టి సోకు జేసుకొంటే ఇంతకంటే శానా బాగుంటా" అంది వెన్నెల. ప్రసాదరావు నిజమే అనుకొన్నాడు. 'నువ్వు శుభ్రంగా స్నానంచేసి మంచి చీర కడితే ఇంత కంటే వంద రెట్లు బాగుంటావు వెన్నెలా. కాలం కలిసొస్తే ఆ అందాన్ని మొదటి సారి చూసే అదృష్టం నాకే కలుగుతుంది' అనుకొన్నాడు.

"వెన్నెలా! సినిమా అయిన తరువాత రాత్రికి ఎక్కడ పడుకొంటావ్" అడిగాడు ప్రసాదరావు.

"ఏడ పడుకొనేది దొరా. ఎక్కడైనా రోడ్డు పక్కన ఏ సెట్టుకిందో తొంగుంటా. లేకపోతే ఏదైనా దారి జూపించు"

"మా ఇంటికొస్తావా"

"ఆ వస్తా, డబులకాటు సింగు బెడ్డుండాదా" ఆత్రంగా అడిగింది వెన్నెల.

"స్ప్రింగు బెడ్డా. ఉంది."

"ఎందుకులేదొరా. మీ మొగుడూ పెల్లాల మద్దెన నేనొచ్చిపడుకోడం. మీ ఉసురు నాకెందుకు" అంది అంతలోనే నిరాశగా.

"నేను ఒంటరిగానే ఉంటున్నాను"

"అట్టాగా. అయితే సరే. మనిద్దరం ఎంచక్కా ఆసింగు బెడ్డుమీద తొంగోవచ్చు" సంబరపడసాగింది వెన్నెల.

'వలలోకి చిలక తనకై తాను వచ్చి వాలుతానంటోంది. అంతకంటే కావలసినదేముంది' అనుకొన్నాడు ప్రసాదరావు.

మళ్లీ మొదలైంది వెన్నెల తొడచరుపులు. ఆమె చరిచే ప్రతి చరుపు అతనికి గిలిగింతలు పెడుతున్నట్లుగా వుంది. ప్రతి నిముషానికి గుసగుసలాడుతూ అతని చెవి దగ్గరకొచ్చినప్పుడల్లా ఆమె ఎద అతని గుండెల్ని బలంగా రుద్దుకొని అతణ్ణి కవ్వించి మరో లోకంలోకి తీసుకుపోతూ వుంది.

ఇలా ఆనంద అనుభూతుల మధ్య సినిమా అయిపోయింది.

బయట కొచ్చిన తరువాత ఇద్దరూ రోడ్డుమీద కొద్ది దూరం నడిచారు. ప్రసాదరావు ఆటోను పిలిచాడు. ఇద్దరూ ఆటోలో కూర్చొన్నారు. ఆమె స్పర్శ అతనికి పులకింతలు పెడుతూవుంది. మెల్లగా భుజంమీద చేయివేసి దగ్గరకు తీసుకొన్నాడు. ఆమె అతని ఒళ్లో ఒద్దికగా ఒదిగిపోయింది. ఇప్పుడతనికి ఆమె దగ్గర చెమట కంపు అనిపించడంలేదు. సుగంధ పరిమళాలు వీస్తున్నట్లుగా వుంది.

ఇలా తను దగ్గరకు తీసుకొనగానే కాదనకుండా ఒదిగిపోయిందంటే ఇక తను ఏమి చేసినా కాదనదు. ఈ రాత్రిశృంగార రసరాజ్యంలో తనను ఆనందంలో అనురాగంలో తేల్చివేసే రసరాణి వెన్నెల. ప్రేమగా ఆమె వీపు నిమిరాడు ఆసందులోని ఆ చిన్న డాబా ఇంటి ముందు ఆటో ఆగగానే లేపాడు ప్రసాదరావు.

ఆటో పంపి, బయట గేటు తాళం తీశాడు. లోపల మెట్లెక్కి ఇంటి తాళం తీశాడు. లోపల గదులన్నీ చూపాడు.

"అబ్బోదొరా. అన్ని రూముల్లోకి బెడ్డురూము బలే బాగుండాదే. ఇయాల్టికి ఇది నాదే" అంటూ స్ప్రింగుకాటు బెడ్ మీద రెండుసార్లు ఎగిరికూర్చొంది. తరువాత అద్దంలో చూసుకొని తనకు తాను మురిసి పోయింది వెన్నెల.

తరువాత ఆమెను బాత్‌రూములోకి తీసుకెళ్లి "ఇదుగో. ఈ సబ్బు పూర్తిగా అరిగిపోయేదాకా నాలుగు సార్లు ఒళ్లంతా రుద్దుకొని స్నానం చెయ్యి. ఇదుగో టవలు. ఒళ్లు తుడుచుకొని ఈ పౌడరు ఒళ్లంతా చల్లుకో. ఇక్కడ చీర, జాకెట్టు పెడుతున్నా స్నానంచేసి ఇవి కట్టుకో" అన్నాడు.

"దొరా. రాత్రుళ్లు సీరెలు, జాకెట్లంటే మా సెడ్డ సిరాకు. సానం జేసి ఈ టవలుతో ఒళ్లు తడుసుకొని వత్తా. బెడ్డురూములో పెద్ద అద్దం వుందిగందా. పౌడరు ఆడనే కొట్టుకుంటా ఒంటిమీద. రాత్రుళ్లు ఒంటిమీద గుడ్డుంటే నాకు నిద్దరెట్టదు" అంటూ బాత్ రూము తలుపు కూడా వేసుకోకుండా దోపుకున్న గోచి తీసి చీర విప్పి అతని ముందే దండేం మీద వేసింది.

సన్నని తెల్లని మెడ, సమున్నతమైన ఎద, పలుచని పొట్ట, అస్పష్టంగాలంగా క్రింద కనిపిస్తున్న బలమైన కాళ్ళు, ప్రసాదరావుని తల తిప్పకుండా చేశాయి. 'ఛ... ఇలా చూడడం దేనికి. ఓ పదిహేన్నిముషాల్లో బెడ్‌మీదికి తనే వస్తుందిగదా. అప్పుడు చూడొచ్చు' అనుకొంటూ వచ్చి బెడ్ మీద పడుకొని ఆలోచించసాగాడు.

లోపల బాత్‌రూములో కుళాయి చప్పుడు, ఒళ్లురుద్దుకొన్న చప్పుడు వినిపిస్తున్నాయి. అరగంట అయింది. రాలేదు. 'తను ఒకటికి నాలుగుసార్లు రుద్దుకొని స్నానం చేయమన్నాడు గదా. బాగా శుభ్రంగా స్నానం చేయనీ' అనుకొన్నాడు.

గడులు దాటుకొని వెళ్ళి ఇంటి లోపలి మెయిన్ వాకిలి గడియ సరిగా పెట్టాడో లేదోనని అనుమానం వచ్చి వెళ్ళి చూశాడు. లోపల గడియ సక్రమంగానే పెట్టివుంది. కిటికీలు అన్నీ బిగించాడు. లోపల ఏం జరిగినా ఎవరికీ తెలియదు.

మళ్ళీ వచ్చి పడుకొని పైన తిరుగుతున్న ఫాను వైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు సమయం ఒంటిగంట. ఇక ఎంత ఆమెతో గడిపినా అయిదు గంటలకంటే ఎక్కువసేపు గడపలేడు. ఆదే సాయంత్రం ఈ పిల్ల తటస్థపడుంటే ఎంత బాగుండేది, అనుకొంటున్నాడు.

రాబోయే అమె కోసం ఎదురుచూస్తూ, తను అనుభవించబోయే సుఖాలను రిహార్సల్సు వేసుకొంటూ అలాగే ఆలోచనలతో గాఢనిద్రలోకి వెళ్ళిపోయాడు. అది మంచి నిద్ర సమయం మరి.

ఉదయం ఆరుగంటలకు అలారం మోతకు మెలకువ వచ్చింది. 'ఛ... పాడు నిద్ర' అనుకొంటూ రాత్రి తనతో వచ్చిన అందాల సుందరి కోయపిల్ల వెన్నెల కోసం చూశాడు. పక్కనలేదు. బాత్‌రూములోకి వెళ్ళి చూశాడు. ఎవరూ లేరు. ఇంకా ఆమె స్నానం చేస్తున్నట్లే కుళాయిలో నీళ్లు గలగలా బక్కెట్లోకి పడుతున్నాయి. బయట తలుపులు మెయిను గడియ తీసి తలుపులు దగ్గరకు వేసి వున్నాయి.

అయితే ఆ పిల్ల బ్లాక్‌మెయిలరన్నమాట. తనను మోసం చేసిందన్నమాట. నేడు డబ్బుకు కక్కుర్తిపడ్డ ఆడపిల్లలు ఎన్నిరకాల మోసాలు చేస్తున్నారో తనకు తెలుసు. ఆ తరహాకు చెందినదేనా ఈ కోయపిల్ల కూడా. ఇల్లాంతా తిరిగి చూశాడు. ఒక్క వస్తువూ పోలేదు. పర్సులోని డబ్బు పెట్టినది పెట్టినట్లేవుంది.

అతను తల పట్టుకొని మళ్ళీ బెడ్ మీద కూర్చున్నాడు. అతనికి అప్పుడు టేబులు మీద అలారం టైంపీస్ కింద పెట్టబడిన మడచిన కాగితం కనిపించింది. ఆశ్చర్యంగా దాన్ని తీసుకొని చదవడం మొదలుపెట్టాడు.

పూజ్యులు, గౌవరనీయులైన, ప్రముఖ సినీ రచయిత,

హిట్ డైరెక్టరు, ఎస్.పి.రావు గారికి.

నమస్సులు.

రాత్రి కనిపించి, తెల్లారేసరికి మాయమైన కోయపిల్ల వెన్నెలను గురించి తిట్టుకుంటూ వుంటారుకదూ.

మీలో ఆవేశం కలిగించి, ఆశలు రేపి, కోరికల పడగలు ఎత్తించి, మిమ్మల్ని ఒక్కసారిగా ఆగాధంలోకి తోసివేసిన నన్ను క్షమించండి.

మీరు గొప్పమేధావులు, సినీ ప్రపంచంలో తిరుగులేని నంబరు వన్ డైరెక్టరు. అలాంటి మిమ్మల్ని ఎవరు ప్రేరేపించి ఎలాంటి తప్పు చేయించినా వాళ్లు క్షమార్హులు కారు. మీరు

ప్రజల మనిషి, పబ్లిక్ ఫిగర్. మీ మేధస్సును సమాజం బాగుకోసం వినియోగించాలి. కాని క్షణికమైన సుఖంకోసం కాదు సార్.

మీరు మీ సినిమా విడుదలయిన తరువాత అప్పుడప్పుడు మద్రాసు నుంచి దగ్గరలో వున్న నెల్లూరికి స్వయంగా వచ్చి రహస్యంగా మీ సినిమాను చూసి సినిమా సక్సెస్‌ని నిర్ణయిస్తారని తెలుసుకొన్నాను. ఆరు నెలల క్రితం విడుదలై ఇంకా సంచలనం సృష్టిస్తున్న మీ 'కోయపిల్ల' సినిమాను మళ్లీ చూడ్డానికి వచ్చారని తెలుసుకొన్నాను. మీ స్నేహితుడు ఇంట్లో దిగారని, ఈ రోజే మీ స్నేహితుడు భార్య, పిల్లలతో అర్జంటు పనుండి ఊరెళ్లారని తెలుసుకొన్నాను. కోయపిల్ల వేషంలో మిమ్మల్ని నమ్మించి మీతో మధురమైన మూడు గంటల సమయం గడిపాను.

ఇంతకూ నేనెవరో తెలుసా, కోయపిల్ల సినిమాకు మీరు ఇంటర్వ్యూచేసిన యాభైమంది అమ్మాయిల్లో నేనొకతెను. ఇంటర్వ్యూలో నాకిచ్చిన అయిదు నిమిషాల టైములో బయట రాజకీయం జరిగి రెండు నిమిషాలు వేస్టుకాగా, లోపల అనవసర కాలక్షేపంతో మరో రెండు నిముషాలు వేస్టుకాగా ఒక్క నిముషం నా నటన మీ ముందు ప్రదర్శించిన దురదృష్టవంతురాల్ని. ఇదంతా అక్కడవాళ్ళు చేసిందే. నేను సెలక్టు అవుతానని భయపడి నిర్మాత మనసులో పడ్డ పిల్లకు అన్ని అవకాశాలూ ఇచ్చి మీచే త ఒప్పించి హీరోయిన్‌గా తీసుకొన్నారు. అది నాకు బాగా తెలుసు.

తరువాత మా ఊరి ఆడపడుచు అయిన మీ శ్రీమతిని కలిసి నా బాధంతా మొరపెట్టుకొన్నాను. ఆమె నన్ను ఊరడించి ఏదో ఒక విధంగా నా నటనా సామర్థ్యాన్ని మీ ముందు బయటపెట్టమంది. ఎంత మంది కాదన్నా మీరు నటనకు విలువనిచ్చి తగిన కథానాయికగా ఎవరిని తీసుకున్నా ఏ నిర్మాతా కాదనడని అందరికీ తెలుసు. అందుకే ఈ అవకాశాన్ని తీసుకుని కోయపిల్లలా నటించి మిమ్మల్ని మైమరపించగలిగాను.

నాకు నటన తెలిసినా తెలియకపోయినా, మీరు ఏ సినిమాలో నన్ను బుక్ చేసుకొన్నా చేసుకోక పోయినా, ఈ క్రింద అడ్రసుకు వచ్చి మా ఇంట్లో ఒక్కరోజు ఆతిథ్యం తీసుకుని వెళ్లండి. మీ సరసం, శృంగారం, ప్రేమ అన్నీ మా అక్కయ్యకు అదే మీ అర్ధాంగికి ఒక్కరికే పరిమితం చేయండి.

మీలాంటి ప్రముఖ వ్యక్తితో గడిపిన ఆ మూడు గంటలే నాకు మూడు జన్మలకు సరిపోయే మధురమైన అనుభవం.

క్షమించమని కోరుతూ,
మీ అభిమాని,
భవాని.

అంత వరకు దిగులుపడి వున్న అతని ముఖం వెలుగునుపరచుకొంది. చిన్నగా నవ్వుకొన్నాడు.

తరువాత పక్కనే టేబులు మీదున్న సూటుకేసు తెరిచాడు. అందులో అతను తదుపరి తీయబోయే 'కోయదొర' సినిమా స్క్రిప్టు వుంది. నింపాదిగా దాన్ని చేతిలోకి తీసుకొని హీరోయిన్ పాత్రకెదురుగా ఖాళీగావున్న స్థలంలో 'భవాని' అని రాసుకున్నాడు.

అతనికిప్పుడు హాయిగా వుంది. తను తరువాత తీయబోయే 'కోయదొర' సినిమా, 'కోయపిల్ల' సినిమాకంటె సూపర్ హిట్ అవుతుందన్న దృఢమైన నమ్మకం కలిగిందతనకి✷

**(స్వాతి వీక్లీ, తేది 9-7-1993)**